సైబర్ దోపిడీ

- ఆన్‌లైన్ జాబ్, ఫోన్ కాల్‌తో క్షణాల్లో బురిడీ
- మోసపోతున్న వారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యావంతులే అధికం

ఆగస్టు, సెప్టెంబర్.. రెండు నెలల్లో 515 కేసులు



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఒక్కోరోజు రెండు మూడు కేసులు కూడా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. సైబర్ క్రైమ్ జరిగిన గంటల్లోనే బాధితులు ముందుగా 1930 సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం వారి పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు.ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతుండడంతో ప్రజలు లక్షల్లో నష్టపోతున్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఏదో ఒకచోట నేరగాళ్ల బారిన పడుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ 2 నెలల వ్యవధిలో జిల్లాలో 515 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి.అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో నమోదు కాగా..మోసపోయిన వారంతా చదువుకున్నవారే కావడం గమనార్హం.

ఇలా మోసపోతున్నవారే ఎక్కువ..

- ఆన్‌లైన్ ఉద్యోగాలు, పార్ట్ టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌లకు స్పందించి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటనలకు క్లిక్ చేసి సైబర్ వలలో పడుతున్నారు.
- పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ, అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి దోచుకుంటున్నారు
- కొందరు సైబర్ నేరగాళ్లు ఏటీఎం కార్డు, డెబిట్ కార్డ్ అప్డేట్ చేయాలని వివరాలను సేకరించి బాధితుడి బ్యాంక్ ఖాతా నుండి డబ్బు మాయం చేస్తున్నారు.
- ఇటీవల మిలిటరీ దుస్తులతో వచ్చిన వ్యక్తులు తాము క్యాంపునకు వచ్చామని 25 మందికి ల్యాబ్ టెస్టులు చేయాలని ఫోన్ చేసి అతని ఖాతా నుండి నగదు మాయం చేసిన సంఘటన తెలిసిందే. ఇలాంటి సైబర్ నేరాలపై పోలీసులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన నేరాలు మాత్రం ఆగడం లేదు.

ఇటీవలే జరిగిన సంఘటనలు..

- పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా మొత్తం రూ.30 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌తో పాటు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- రామచంద్రాపురం మండల పరిధిలోని ఈదుల నాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్ కు ఆగస్టు 16వ తేదీన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.26 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ వచ్చారు. డబ్బు గురించి అడగగా స్పందన లేకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- అమీన్‌పూర్ మండల పరిధిలోని లాలాబాయ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ సెప్టెంబర్ 25 వ తేదీ మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.28 లక్షలు చెల్లించాడు. వారిచ్చిన టాస్కులు పూర్తి చేసి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు అమీన్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

1930కి సమాచారం అందించాలి



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో పడి మోసపోతున్నారు.అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఫోన్ కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్‌ల పేరుతో వచ్చే, ఆన్‌లైన్ జాబులను నమ్మొద్దు. పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని పటాన్‌చెరు ,అమీన్‌పూర్ బీడీఎల్, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల ,హత్నూర పోలీస్‌స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి

పోలీసులు సూచిస్తున్న జాగ్రత్తలు..

- అపరిచిత వ్యక్తి వాట్సాప్, ఫోన్‌కాల్‌కు స్పందించకుండా ఉంటే మంచిది.
- తక్కువ ధరకే వస్తువులు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో పెడితే దాన్ని చూసి పరిశీలించిన తర్వాతే నగదు ఇవ్వాలి.
- సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు వ్యక్తిగత ఫొటోలు పంచుకోకపోవడమే మంచిది.
- ఉచిత వైఫై, ఓపెన్ నెట్వర్క్ ద్వారా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు లాగిన్ కావొద్దు. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు వ్యక్తుల అకౌంట్ పాస్‌వర్డ్ దొంగతనం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- చాలావరకు సామాజిక మాధ్యమాల్లో మహిళల ఫొటోలను తస్కరించి, మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉంది. అమ్మాయిలు ఇతర చిత్రాలు పెట్టుకుంటే మంచిది.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల హామీలను ప్రజలు నమ్మరు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



స్థానికులకు కరపత్రాలను అందిస్తున్న రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల దొంగ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం చందానగర్ డివిజన్ శివాజీనగర్ వీకర్‌సెక్షన్, టెలిఫోన్ కాలనీలలో ఆయన ఇంటింటికి తిరుగుతూ బీజేపీ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ఈ రెండు పార్టీలు ఒకటై వస్తున్నాయన్నారు. శేరిలింగంపల్లిలో ఈసారి కాషాయ జెండాను ఎగురవేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీకి శేరిలింగంపల్లిలో తిరుగులేదన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు రామ్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి,చ మల్లేష్‌గౌడ్, ప్రభాకర్, కృష్ణదాస్, చందర్‌యాదవ్, గౌస్,రాజు, అశోక్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువత చేరిక



పార్టీలో చేరిన యువకులతో నాయకులు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ ప్రభుత్వం యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా తీవ్ర అన్యాయం చేసిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో చందానగర్, మియాపూర్ డివిజన్‌కు చెందిన పలువురి యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపులో యువకుల ఓట్లు కీలకం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాములుగౌడ్, మహేందర్, గోపాల్, జీవన్, రాము, జగదీష్, భరత్‌యాదవ్, కుమార్‌సాగర్, చరణ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే..



రాయదుర్గం: గోపన్‌పల్లి శివారులోని వివాంటీస్ అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023లో అండర్–11, అండర్–13, అండర్–15, విమెన్స్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, మెన్ డబుల్స్ పోటీలను నిర్వహించారు. అండర్–11 విభాగంలో మొదటి స్థానంలో దర్శిల్, రెండవ స్థానంలో కె.అర్నవ్, మూడవ స్థానంలో అథరవ్ వేదుల నిలిచారు. అదేవిధంగా అండర్–13లో నవికాఅగర్వాల్, సమంత్, మోక్షజ్ఞ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–15లో సుజయ్ గద్దం, రామ్‌ప్రహన్, విక్రాంత్ బాల, విమెన్స్ సింగిల్స్ విభాగంలో ప్రియాంక, అలేఖ్య, త్రిషాసిన్హా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా మిక్స్‌డ్ డబుల్స్ విజేతలలో మనోహర్ గద్దం–త్రిషా సిన్హా, సుబ్బు–అలేఖ్య, రుషిదేష్‌పాండే–ప్రియ, మెన్స్ డబుల్స్ విజేతలుగా మనోహర్‌గద్దం–సౌరబ్‌జైన్, రుషిదేష్‌పాండే–పియూష్, రామ్‌శంకర్–డేవిడ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలుగా నిలిచిన వారికి అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ట్రోఫీలను బహుకరించి అభినందించారు.

క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు: సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఆయన పర్యటించారు.రజక బస్తీ, గోకుల్ నగర్, గౌతంనగర్ కాలనీలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పలువురిపై కేసు నమోదు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది కూలివేసింది. బుధవారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ శివారులోని 181 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు అందాయి. హుటాహుటిన తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆపై వాటిని కూల్చివేశారు. నిందితులైన వరకంటి సాయిలు, గొల్ల వేణు, వడ్ల రాజు, భానుకిరణ్, కొండా లక్ష్మణ్, జీతయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ఆర్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, బీదర్‌కు చెందిన జగదీష్ దేశ్‌ముఖ్(38) భార్య శ్రీదేవితో కలిసి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చి ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. వీరి కూతురు శాలినీ(3)కి ఆరోగ్యం బాగా లేకపోవడంతో, ఈనెల 7వ తేదీన భార్య శ్రీదేవి పాపతో బీదర్ వెళ్లి అక్కడే ఉంది. ఈ క్రమంలో 10 వ తేదీ రాత్రి జగదీష్ దేశ్‌ముఖ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్ చేసి నేను చనిపోతానని చెప్పగా శ్రీదేవి స్థానికంగా ఉండే బాలాజీకి ఫోన్ చేసి విషయం చెప్పగా అతడు వెళ్లి చూసే లోపు జగదీష్ ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు.అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో రెండు బెల్ట్ షాపులు, అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటలో రెండు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం రావడంతో బుధవారం దాడులు నిర్వహించి రూ.29 వేల 757 విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన సాయిబాబా



కేటీఆర్‌ను కలిసిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం: ఐటీ శాఖామంత్రి, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీరామారావును గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో పార్టీ పరిస్థితి ఎన్నికల్లో సమష్టిగా కృషి చేయాలని సాయిబాబాకు మంత్రి సూచించారని పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, పార్టీ పరిస్థితిని మంత్రి అడిగినట్లు తెలిపారు.

'మనూ'లో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మనూలో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కేంద్రాలైన ఔరంగాబాద్, బీదర్, భోపాల్, నూహ్, సంభాల్, శ్రీనగర్ లలో, పాలిటెక్నిక్ కేంద్రాలైన బెంగళూరు, కడప, కటక్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మనూ 2023–24లో హాజరైన, అర్హత సాధించిన అభ్యర్థులు, ఇంతకుముందు నోటిఫై చేయబడిన తాత్కాలిక జాబితాలలో పేరు కనిపించని అభ్యర్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చని ఆమె వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత క్యాంపస్‌లలో వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ అక్టోబర్ 16న జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు 19,20 తేదీలలో ఫీజు చెల్లించ వచ్చన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పదవీ విరమణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొ.వీసీ ఆర్ఎస్ సర్రాజు పదవీవిరమణ అభినందన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు హెచ్‌సీయూలో అధ్యాపకుడిగానే కాకుండా వివిధ బాధ్యతలను నిర్వహించారు. మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో డీన్ ఆచార్య కృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణ మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక్కరికీ సహజమని, వారి సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆచార్యులు గజేంద్రపాఠక్, మురళీ మనోహర్ ,దార్ల వెంకటేశ్వరరావు, ఫజలుల్లా, పిల్లలమర్రి రాములు, పమ్మి పవన్‌కుమార్, భీమయ్య, హైమావతి, భుజంగరెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జై భారత్‌నగర్ సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో నెలకొన్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కాలనవాసులతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాలనీ వాసులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేందర్, కాలనీవాసులు కుమారస్వామి, పూర్ణచందర్‌రావు, సాంబశివరావు, శ్రీనివాస్, ప్రభాకర్, మహేష్, నర్సయ్య, సారంగపాణి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ' ఘనీభవించిన పదార్థం భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది .సదస్సు చైర్ ప్రొఫెసర్ అశోక్ ఛటర్జీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా ఉన్న నిపుణులను ఒకచోట చేర్చి వినూత్న ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, ఆధునిక కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్‌లో తాజా పరిణామాలను పంచుకోవడానికి ఈ సదస్సు తోడ్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి జెయిస్ నగేష్ మాట్లాడుతూ...ఈ రంగంలో యువత భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కొండాపూర్ ఆస్పత్రిలో మార్చురీ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వినతి

రాయదుర్గం: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి ప్రాంతం ఐటీ రంగానికి కేంద్రంగా మారడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి చాలా మంది ఇక్కడ నివాసముంటున్నారని పేర్కొన్నారు. వారు ఉద్యోగాల నిమిత్తం విదేశాలలో పనిచేయడానికి వెళ్లగా వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసముంటున్నారని వివరించారు. ఈ క్రమంలో ఎవరైనా మృతి చెందితే వారు వచ్చే వరకు అంత్యక్రియల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని అందుకోసం గాంధీ, ఉస్మానియా, ఇతర ఆస్పత్రుల మార్చురీలో పెట్టాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేస్తే కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరువాసులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: దసరా పండగను పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించాలని ఆలయ పాలక మండలి నిర్ణయించింది. 23వ తేదీ రాత్రి 7.30 గంటలకు శమీ పూజను నిర్వహిస్తారు. కాగా 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారం సమయంలో సమర్పించిన చీరలను 24వ తేదీన విక్రయించాలని తలపెట్టారు. కాగా ఆలయంలో ప్రత్యేకంగా పిల్లల కోసం సరస్వతీమాత పూజ నిర్వహించాలని నిర్ణయించారు. 24వ తేదీన షిర్డీసాయిబాబాకు అభిషేకం ఉంటుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

మానసిక ఆరోగ్య దినోత్సవం



మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని కెనరీ ద స్కూల్లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మన జీవితంలో మానసిక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు నిర్వహించిన ఉదయ అసెంబ్లీలో విభిన్న భావోద్వేగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా పీఓఎస్‌సీవో వర్క్‌షాప్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టినా ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించే మార్గాలు ఆవశ్యకత గురించి విద్యార్థులు తెలియజేశారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రూ.37 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.37 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ లక్ష్మీ సాయి మిడోస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ ఆగస్టు 30న తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.37 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ వచ్చారు. చివరగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్షన్ కోడ్.. వాహన తనిఖీలు ముమ్మరం

నలుగురి నుండి రూ.9 లక్షల 95 వేలు నగదు పట్టివేత



వాహన తనిఖీల్లో పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నియమావళి అమలు కావడంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు ప్రారంభించారు. పటాన్‌చెరు పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో బుధవారం పటాన్‌చెరు పోలీసులు ,ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో కేపీహెచ్‌బీకి చెందిన కోటిరెడ్డి అనే వ్యక్తి వద్ద రూ. 5 లక్షలు, కూకట్ పల్లికి చెందిన హేమంత్ వద్ద రూ.2.25 లక్షలు, తెల్లాపూర్‌కు చెందిన రామకృష్ణ వద్ద రూ.1 లక్ష 60 వేలు, బీరంగూడకు చెందిన రాజ్‌కుమార్ వద్ద లక్ష 10 వేలు, మొత్తం 9 లక్షల 95 వేలు పట్టుకున్నారు.ఈ తనిఖీలో పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పని ట్రాఫిక్ చిక్కులు



ప్రగతినగర్ రోడ్డులో వన్‌వేతో ట్రాఫిక్ జామ్

నిజాంపేట్: రోడ్డు పనులతో వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ ప్రధానరోడ్డు మరమ్మతు పనులకు కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో మోర్ సూపర్ మార్కెట్ నుంచి ఇన్‌కాయిస్ సర్కిల్ వరకు రోడ్డును బ్లాక్ చేయడంతో ఒక వైపు నుంచే వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ సమయంలో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

ఉదయం, సాయంత్రం వేళల్లో చుక్కలు

- అటు కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ మీదుగా గండిమైసమ్మకు రాకపోకలు సాగించే వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. బాచుపల్లి, గండిమైసమ్మ, బహదూర్‌పల్లి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో విద్యా సంస్థలతో పాటు భారీ సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో ఈ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో అర కిలోమీటరు దాటాలంటే అర్ధగంట సమయం పడుతుండటంతో వాహనదారులు అసహనానికి గురవుతున్నారు.



ప్రగతినగర్ రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం

కానరాని ట్రాఫిక్ సిబ్బంది..

రోడ్డు పనులతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసి కూడా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా దారి మళ్లింపు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఒకే మార్గం గుండా అటు, ఇటు వెళ్లే వాహనాలు ఒకేసారి వస్తుండటంతో వాహనదారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. ఐదు రోజులుగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నా ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడంతో అధికారులు ప్రణాళిక లోపాన్ని స్థానికులు వేలెత్తి చూపుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే ట్రాఫిక్ కష్టాలు తీరతాయని వాహనదారులు కోరుతున్నారు.